ఎరుపెక్కిన గుంటూరు

ప్రజలకు అభివాదం చేస్తున్న జంగాల అజయ్‌కుమార్ పక్కన నారాయణ, శ్రీనివాసరావు, మస్తాన్‌వలి,

విశాలాంధ్ర-గుంటూరు : ఇండియా కూటమి బలపరచిన గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమం మంగళవారం అట్టహాసంగా జరిగింది. అడుగడుగునా జననీరాజనాలు అందుకున్నారు. నామినేషన్ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. నామినేషన్ దాఖలు చేయడానికి వెళ్ళుతున్న జంగాల అజయ్‌కుమార్‌కు మద్దతుగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ఇండియా కూటమి పార్టీలతో పాటు కార్మిక, కర్షక, ప్రజా సంఘాలు, మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మండుతున్న ఎండను సైతం లెక్కచేయకుండా ఇండియా కూటమి నాయకులు, వామపక్ష శ్రేణులు అరుణపతాకాలు చేతబూని ముందుకు సాగారు. డప్పు వాయిద్యాల మధ్య, మహిళల కోలాట ప్రదర్శన నడుమ, మహిళల నృత్యాలు, యువకుల వినూత్న ప్రదర్శనల మధ్య ర్యాలీ కోలాహలంగా సాగింది. ఎర్రటి గొడుగులు, బూరలను చేతపట్టిన మహిళలు ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి హిందూ కళాశాల కూడలి, నగరంపాలెం మీదుగా ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకుంది. అనంతరం అక్కడ జంగాల కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

మహిళల కోలాట ప్రదర్శన

- కలిసొచ్చిన కార్మిక, కర్షక, ప్రజా, మహిళా సంఘాలు

ర్యాలీ ముందు భాగంలో బైక్‌లపై వామపక్ష శ్రేణులు

ఎర్రటి గొడుగులు, బూరలతో మహిళలు

సీపీఐ పతాకాలతో యువకుడు

సర్ప నృత్య ప్రదర్శన చేస్తున్న పార్టీ శ్రేణులు

విశాలాంధ్ర
గుంటూరు జిల్లా

అట్టహాసంగా అంబటి మురళీకృష్ణ నామినేషన్ ర్యాలీ

విశాలాంధ్ర-పొన్నూరు: పొన్నూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ మంగళవారం నామినేషన్ ర్యాలీ ఘనంగా జరిగింది. పొన్నూరు నియోజకవర్గం పెద్దకాకాని మండలం నంబూరు నుండి పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు కార్యకర్తలు నాయకులతో కలిసి తక్కెళ్ళపాడు, పెద్దకాకాని, నారా కోడూరు, చేబ్రోలు, మంచాల, బ్రాహ్మణ కోడూరు అడ్డరోడ్డు, మామిడిపల్లి అడ్డరోడ్డు, మునిపల్లె, పచ్చలతాడిపర్రు మీదుగా పొన్నూరుకు ర్యాలీ చేరుకున్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభ మైన ర్యాలీ అట్టహాసంగా వేలాదిమంది కార్యకర్తల నడుమ మురళీకృష్ణ పొన్నూరుకు చేరుకున్నారు. పొన్నూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఏ.లక్ష్మీ కుమారి నామినేషన్ సోమవారమే దాఖలు చేసిన ఆయన వైసీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య స్థానిక నాయకులు కార్యకర్తలతో ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అభిమానులు వేలాదిగా పాల్గొని జయప్రదం చేశారు.

జగనన్న అంటే ఒక నమ్మకం: మంత్రి రజిని

విశాలాంధ్ర-గుంటూరు : జగనన్న అంటేనే ఒక నమ్మకం అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైసీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేనల నుంచి మంగళవారం ఒక్క రోజే ఏకంగా 250 కుటుంబాలకుపైగా వైసీపీలో చేరాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి ఇటీవల వైసీపీలో చేరిన గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ముఖ్య నాయకులు మాజీ కార్పొరేటర్ ఎస్‌కే సైదా ఆధ్వర్యంలో 100 కుటుంబాలు, టీడీపీ గుంటూరు జిల్లా ఉపాధ్యక్షుడు మేకల మాధవ్ యాదవ్ ఆధ్వర్యంలో 100 కుటుంబాలు, బైరా అజయ్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. శ్యామలానగర్ రెండోలైనులోని మంత్రి విడదల రజిని స్వగృహానికి వీరంతా చేరుకుని పార్టీ కండువా కప్పుకున్నారు. మంత్రి విడదల రజిని పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారందరితో ఆప్యాయంగా మాట్లాడారు. నగరంలోని ఏటీ అగ్రహారం, సాయినగర్, కృష్ణనగర్, చుట్టుగుంట, రామిరెడ్డినగర్ తదితర ప్రాంతాల నుంచి చేరికలు జరిగాయి.

కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ హైస్కూల్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పెదనందిపాడు ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న వై.హారిక 592 మార్కులు సాధించి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి స్థానం పొందారు. ఈ సందర్భంగా గుంటూరులోని సత్య సెక్యూరిటీ కార్యాలయంలో మంగళవారం అభినందన కార్యక్రమం జరిగింది. దీంతో రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, పెదనందిపాడు ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు కాళహస్తి సత్యన్నారాయణ, ప్రధానోపాధ్యాయులు నల్లూరి సత్యన్నారాయణ వై.హారికకు అభినందనలు తెలియజేశారు. అనంతరం నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నట్లు తెలిపారు. పెదనంది పాడు ఎడ్యుకేషన్ సొసైటీ విద్యా ప్రమాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వటం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు అన్ని రంగాల్లో పోటీ పడుతుండటం విద్యావ్యవస్థకే గర్వకారణమని అన్నారు. సొసైటీ అధ్యక్షులు కాళహస్తి సత్యన్నారాయణ మాట్లాడుతూ 12 ఏళ్ళ నుంచి తమ సంస్థ 10వ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది వై.హారిక 600 మార్కులకు గానూ 592 మార్కులతో 98.67శాతం సాధించినట్లు కొనియాడారు. ఉపాధ్యాయులు, పాలకవర్గం, పిల్లలతల్లి దండ్రుల సహకారంతో నూరు శాతం ఫలితాలు సాధించామన్నారు. తొలుత హారికను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు గోరంట్ల పున్నయ్య చౌదరి, నర్రా వీరయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాతూరి శ్రీనివాస్, మువ్వా నాగవర్ధిని, ఆకుల ఫణికుమార్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక ఇజ్రాయిల్ పేట లోని బొర్రా నాగేశ్వరరావు మున్సిపల్ హైస్కూల్ చెందిన షేక్ ఫాతిమా తబసుమ్ పదవ తరగతి ఫలితాలలో 600 మార్కులకు 582 మార్కులు సాధించి గుంటూరు నగరంలోని ప్రభుత్వ, మున్సిపల్, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలలోనే అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థిగా ప్రథమ స్థానంలో నిలిచిందని స్కూల్ ప్రధాన ఉపాధ్యా యులు జిలాని భాష తెలియజేశారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఫాతిమా తండ్రి సుభాని హోటల్లో వంట సహాయకులుగా పనిచేస్తున్నారని ఇలాంటి మట్టిలో మాణిక్యాలు అత్యుత్తమ స్థాయిలో ఉత్తీర్ణత సాధించడం గర్వించదగ్గ విషయమని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా అత్యుత్తమ మార్కులతో ప్రభుత్వ పాఠశాల విద్యాభివృద్ధిలో విరాజిల్లుతుందని పేర్కొన్నారు. 500 మార్కులకు పైగా 8 మంది విద్యార్థులు సాధించారు అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని చదువుకు పేదరికం అడ్డు రాదని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిరూపించడం జరిగిందని అన్నారు.

విద్యాసంస్కరణలు ఫలిస్తున్నాయి

విశాలాంధ్ర-గుంటూరు : విద్యా రంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన గొప్ప సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైసీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగరం 39, 42 డివిజన్లలో మంత్రి విడదల రజిని మంగళవారం మనతో మన రజినమ్మ పేరుతో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలు అద్భుతమైన ఫలితాలు సాధించాయని తెలిపారు. విద్యారంగంలో జగనన్న ప్రవేశపెట్టిన సంస్కరణలే అందుకు కారణమని చెప్పారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని గుర్తించిన సీఎం జగన్ ముఖ్యమంత్రి కాగానే ప్రభుత్వ పాఠశాలలపై దృష్టి సారించారని, ముందుగా పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారని, విద్యా ప్రమాణాల పెంపునకు తగిన చర్యలు తీసుకున్నారని చెప్పారు. ఈ ఐదేళ్లుగా ప్రభుత్వం తీసుకున్న చర్యలు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సత్ఫలితాలు ఇచ్చాయని అన్నారు. గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఏకంగా 582 మార్కులు సాధించిందంటే అది తమ ప్రభుత్వ గొప్పతనమేనని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షులుగా డాక్టర్ భవానిదేవి

విశాలాంధ్ర-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నూతన అధ్యక్షులుగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ సి.భవానిదేవి, గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ పాపినేని శివశంకర్ ఎన్నికయ్యారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయం ఆవరణలో మంగళవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులు, గౌరవాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకట సుబ్బయ్య అనారోగ్య కారణంగా మృతి చెందగా, వారి స్థానంలో నేడు ఈ నూతన అధ్యక్షురాలు ఎన్నిక జరిగింది. బాపట్లకు చెందిన డాక్టర్ సి.భవానిదేవి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సచివాలయం ముఖ్య కార్యదర్శిగా పనిచేసి పదవి విరమణ పొందారు. కవయిత్రిగా, కథా, నవలా, వ్యాసరచయిత్రిగా, కాలమిస్టుగా, పలుభాషల అనువాదకురాలిగా భవానిదేవి తెలుగు సాహిత్య రంగంలో తనదైన సేవలు అందించారు. ఈ ఏడు సాహితీ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న వేళ భవానిదేవి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నిక కావడం విశేషం. ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కోశాధికారి నానా, ఉపాధ్యక్షులు డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, బొమ్ము ఉమా మహేశ్వరరెడ్డి, కార్యదర్శులు ఎస్.ఎం.సుభాని, శర్మ సిహెచ్, డాక్టర్ ఎం.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడే పార్టీని గెలిపించుకోవాలి

విశాలాంధ్ర-మంగళగిరి: పేద ప్రజలకు అండగా నిలిచే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని బడుగు బలహీన వర్గాల వారి కోసం వారి పక్షాన ఉండి పోరాడే ఎర్రజెండా పార్టీని గెలిపించుకోవాలని మంగళగిరి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకర్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మంగళగిరి నియోజక వర్గంలోని కాజా గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి వీధికి వెళ్తూ ఘన స్వాగతాన్ని పలికిన గ్రామ ప్రజలు ఎన్నో పోరాటాలు చేసి పేదలకు భూములు పంపిణీ చేసిన పేదల పక్షాన నిలబడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని తెలిపారు. గ్రామంలో అనేక పోరాటాలు చేసి పేదలకు భూములను పంపిణీ చేశారని అంతేకాక వీధిలైట్లు ఏర్పాటు చేయడంలో సీనియర్ నాయకులు ఈదా నాగేందర్‌రెడ్డి కృషి ఎంతో ఉందన్నారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా ముందుండి పోరాడే కమ్యూనిస్టు పార్టీలను గెలిపించుకోవాలని ఓటర్లకు జొన్న శివశంకర్ విజ్ఞప్తి చేశారు.

వైసీపీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-తెనాలి : బోసు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయం నుండి వైకాపా అభ్యర్థి అన్నా బత్తుని శివకుమార్ ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేరుకొని నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నాబత్తుని శివకుమార్ పిలుపు నిచ్చారు.

టెన్త్ ఫలితాలలో 'సుమేధ' విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక ఎన్జీజీవోస్ కాలనీ లోని సుమేధ హై స్కూల్ విద్యార్థులు 2024 పదో తరగతి పరీక్ష ఫలితాలలో విజయ పరంపర మోగించారని స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం స్కూల్ ఆవరణలో పదో తరగతి విద్యా ర్థులు అభినందన సభకు ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి విచ్చేసి అత్యధిక మార్కులు సాధించిన వై.సాయి వాసంతి - 589, పి.మోహన్ ప్రీతి - 584, వై.రాజ్యలక్ష్మి-578, ర్.మనస్వి-560లకు ప్రత్యేకంగా అభినందించి, 500 మార్కులకు పైన వచ్చిన 36 మంది విద్యార్థులకు పుష్ప గుచ్ఛాలతో అభినందించారు. 100 కి 100 మార్కులు వచ్చిన సబ్జెక్ట్ టీచర్లు ను కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-తెనాలి : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ విధిగా ఉపయోగించుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, మున్సిపల్ కమీషనర్ బండి శేషన్న బ్యాంక్ ఉద్యోగులకు, కస్టమర్లకు పిలుపు నిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా కొత్తపేటలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయంలో ఉద్యోగులకు ఓటు హక్కును వినియో గించుకుందాం- ధర్మబద్ధమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించుకుందాం అంటూ అవగాహన కల్పించారు. యస్‌బిఐ చీఫ్ మేనేజర్ ఎ.వి.ఆర్. పవన్ కుమార్ మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ఎక్కువ మంది ఓటర్లు ఓటు వేసి మంచి నాయకులను ఎన్నుకోవ దానికి యువత ముందుకు రావాలని అన్నారు. బ్యాంక్ ఉద్యోగుల, కస్టమర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమీషనర్ కె.అనూష, యస్‌బిఐ డిప్యూటి మేనేజర్ బి.లక్ష్మా నాయక్, వై.అనుపమ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం పోటీల విజేతలకు సత్కారం



విశాలాంధ్ర-తెనాలి : ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర, జాతీయస్థాయిలో జరిగిన పలు పోటీలలో పాల్గొని విజేతలుగా నిలిచిన పట్టణానికి చెందిన బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ పాఠశాల బాలబాలికలను మంగళవారం ఉదయం ఘనంగా సత్కరించారు. నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి దాసరి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయాస్థాయి, రాష్ట్రస్థాయి ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన 150 మంది బాలబాలికలను సత్కరించారు. ఈ-అభ్యాసం వారి రాష్ట్ర స్థాయి పోటీలు, రాష్ట్రస్థాయి చేతిరాత పోటీలు, రాష్ట్రస్థాయి అబాకస్ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలు, ధ్రువపత్రాలు, పతకాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బాలబాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా ఫిరంగిపురం గ్రామం డి.నం.8ఆర్.బ్లాక్ నం-10, టోర్ నం-180లో క్రీస్తునగర్ కాలనీకి చెందిన సంపంగుల బాల కోటమ్మ భర్త భాస్కర్‌కు చెందిన నెం. 21762015 గల లింకు దస్తావేజులు 110చ.గ.ల భూమికి సంబంధించి డాక్యుమెంట్లు పోయినవి. ఈ నెల 1గవ తేదిన దస్తా వేజులు తీసుకొని ఫిరంగిపురం రిజిస్ట్రారు వారి కార్యాలయం వైపు క్రీస్తునగర్ నుంచి బాటలో వస్తుండగా మార్గమధ్యలో పోయినవి. తమ దస్తావేజులు దొరికిన వారు ఈ క్రింది తెలిపిన చిరునామాకు తెలియజేయాలని కోరుతున్నాము.

సంపంగుల బాల కోటమ్మ
సెల్: 7382703318.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: మతోన్మాద బీజేపీని, దాని కూటమి పార్టీలైన తెలుగుదేశం, జనసేన పార్టీలను, రాష్ట్రంలో నిరంకుశ వైఖరి అవలంబిస్తున్న వైసీపీ పార్టీను రానున్న ఎన్నికలలో ఓడించాలని, ఇండియా వామపక్ష కూటమి అభ్యర్థులను గెలిపించాలని, పల్నాడు జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి వెంకట నాగ గోపాల రావు అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి, ఇంటింటికి కరపత్రాల పంపిణీ చేస్తూ, వామపక్ష అభ్యర్థులను గెలిపించాలని, విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన నరేంద్ర మోడీ విధానాలను తెలుగుదేశం, జనసేన పార్టీలు, వైసీపీ అమలు చేసేందుకు పొత్తు పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకురాలు బి శివ నాగరాణి మాట్లాడుతూ మంగళగిరి శాసనసభ సీపీఎం అసెంబ్లీ అభ్యర్థి జొన్న శివ శంకరరావుకు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపైన, గుంటూరు పార్లమెంట్ సీపీఐ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌కు కంకి కొడవలి గుర్తు పైన ఓట్లు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ, సీపీఎం పల్నాడు జిల్లానాయకులు రాజ్ కుమార్, సీపీఎం నాయకులు ఆరుమళ్ళ నాగిరెడ్డి పాల్గొన్నారు.

నేడు నాదెండ్ల మనోహర్ నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-తెనాలి : నేడు (బుధవారం) టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ఐతానగర్ లింగారావు సెంటర్ నుండి ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేరుకొని నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని నాదెండ్ల మనోహర్ విజ్ఞప్తి చేశారు.

తెదేపాకు ఓటు వెయొద్దనే హక్కు వైసీపీకి లేదు

- ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఖాజావలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గత ఐదు సంవత్సరాలుగా బీజేపీతో పరోక్షంగా పొత్తు పెట్టుకున్న టీడీపీ నేడు ప్రత్యక్షంగా బీజేపీతో పొత్తు పెట్టుకుందని, ముస్లింలు ఎవరు టీడీపీకి ఓటు వెయొద్దనే హక్కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేదని ముస్లిం హక్కుల పోరాట సమితి (ఎంహెచ్‌పీఎస్)రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఖాజావలి హితవు పలికారు. ఎంహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలోనే మైనార్టీలకు సంక్షేమ ఫలాలు లభించాయని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీ సంక్షేమం పూర్తిగా అడుగంటిపోయిందని ధ్వజమెత్తారు. మైనార్టీ సంక్షేమ పథకాలు అందించే మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను దివాలా తీయించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని, టీడీపీ పాలనలో ప్రతి సంవత్సరం కొన్ని వేల మందికి ఆర్థికంగా తమ కాళ్ళపై నిలబడే విధంగా పథకాలను అమలు చేస్తున్న మైనార్టీ ఫైనాన్స్ కార్పొ రేషన్‌కు ఒక రూపాయి నిధులు విడుదల చేయకుండాఐదు సంవత్సరాల కాలంలో ఒకరికి కూడా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వకుండా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని ఆయన ధ్వజంమెత్తారు. ఉర్దూ అకాడమిని నాశనం చేసిందే వైసీపీ అని, మైనార్టీ సంస్థలను కుట్ర ప్రకారం ముస్లింలకు ఏవిధంగా కూడా ఉపయోగపడకుండా వైసీపీ చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ముస్లింలకు రెండు శాసనసభ స్థానాలు పెంచి రాజకీయంగా అభివృద్ధి చేశామని చెప్పటం శోచనీయమన్నారు. ముస్లింలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి నిర్దిష్టమైన పథకాలను అమలు చేసిన ఘనత టీడీపీదేనని అన్నారు.

నేడు ఇండియా కూటమి అభ్యర్థి వినయ్ కుమార్ నామినేషన్

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొరివివినయ్ కుమార్ బుధవారం నామినేషన్ వేయనున్నారు. నియోజకవర్గ ప్రజలు, శ్రేయోభిలాషులు అభిమానులు వేలాదిగా తరలిరావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఇండియా కూటమి బలపరిచిన కొరివి వినయ్ కుమార్ తెలిపారు.

పది ఫలితాలలో 'కన్న' విద్యార్థుల ప్రతిభ

A.V.S. Bhanu Prakash

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పదవ తరగతి పరీక్షా ఫలితాలలో కన్న విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కన్న స్కూల్స్ డైరెక్టర్ కన్న మాస్టారు తెలిపారు. ఎ.వెంకట భాను ప్రకాష్ 585, సీహెచ్ చంద్రశేఖర్ 584, ఐ.హారిక 584, డి.షణ్ముక లీలాధర్ గుప్తా 583 మార్కులు సాధించారని తెలిపారు. కన్న స్కూల్లో పాఠశాల నుంచే అమలు చేస్తున్న ఫౌండేషన్ విధానం ద్వారా విద్యార్థులు ఐఐటీలతో పాటు మెడిసిన్‌లో సీట్లు సాధించే స్థాయిలో బోధన అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల విడదలైన ఇంటర్ ఫలితాల్లోనూ తమ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపారని వివరించారు.

9 నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-మంగళగిరి: మంగళగిరి అసెంబ్లీ నియోజవర్గానికి మంగళవారం ఆరుగురు వ్యక్తులు తొమ్మిది నామినేషన్లు దాఖలు చేసినట్లుగా నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జి రాజకుమారి తెలిపారు. ఇండిపెండెంట్‌గా కేసుధీర్ బాబు, జె లోకేశ్వరరావు, పి నాగేశ్వరరావు, జి నాగరాజు, షేక్ రహీం, సీహెచ్ బాల సూర్య ప్రకాష్, మురుగుడు సత్యం రెండవ సెట్టు, వైసీపీ తరఫున మురుగుడు లావణ్య మూడవ సెట్ నామినేషన్ నామినేషన్ దాఖలు చేశారు. జై భీమ్రావు భారత పార్టీ తరఫున శ్రావణ్ కుమార్ నామినేషన్ దాఖలు చేసినట్లుగా తెలిపారు.

సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మంగళవారం మధ్యాహ్నం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరుగవలసిన జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం సభ్యుల కోరం లేకపోవడంతో ఎటువంటి చర్చలు జరుగ కుండానే ముగిసింది. సమావేశానికి అధ్యక్షతన వహించిన జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మధ్యాహ్నం 3.15 గం.లకు సాధారణ సర్వ సభ్య సమావేశాన్ని ప్రారంభించారు. సమావేశంలో గౌరవ సభ్యులు, జెడ్పీటీసీ లు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, కోఆప్షన్ సభ్యులు మొత్తం 86 మంది వున్నారని, సమావేశ నిర్వహణకు పంచాయితీ రాజ్ చట్ట ప్రకారం సభ్యుల కోరం కనీసం 1/3 వ వంతు మంది అనగా 29 మంది సభ్యులు వుండాలని, కాని సమావేశానికి అప్పటి వరకు ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరు కావడంతో గంట సేపు సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి సమావేశం 4.15 గం.లకు ప్రారంభం అయింది. అప్పటికే జెడ్పి చైర్ పర్సన్‌తో కలిపి 11 మంది సభ్యులు మాత్రమే హాజరు కావడంతో సమావేశం నిర్వహించడానికి తగినంత కోరం లేకపోవడంతో సమావేశాన్ని ముగిస్తున్నట్లు జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ మోహన్ రావు, జిల్లా అధికారులు , జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో అక్రమాలు నివారణకు శ్రీకారం చుట్టనున్న సిటిజన్ ఫర్ డెమోక్రసీ

- కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్ర ప్రదేశ్‌లో మే నెల 13న జరిగే ఎన్నికల్లో అక్రమాలను నివారించడానికి సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ నిష్పాతులైన, నిజాయితీగా కృషి చేసిన రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులతో ఎన్నికల నిఘా కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు సిటిజన్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో రోటరీ క్లబ్ ఆఫ్ మార్చూరు, శ్రీకారం కళా పరిషత్‌లు ఓటర్లను చైతన్యపరచడానికి రూపొందించిన ఐదు లఘు చిత్రాలను డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఆవిష్కరించారు. డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలలో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ తరపున ఎన్నికల నిఘాలో భాగంగా పరిశీలకులు మే 9వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో పని చేస్తారని అన్నారు. లఘు చిత్రాల ద్వారా ఓటర్ల ఆలోచనల్లో వారి భావాల్లో పెనుమార్పులు తీసుకురావచ్చునని.. ఆలోచింపజేసేవిగా ఉన్నాయని కొనియాడారు. మే 1,2 తేదీలలో పెన్షన్‌దారులకు వారి ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని కోరారు. లఘు చిత్రాలను రూపొందించిన కందిమళ్ళ సాంబశివరావు, జాష్టి అనురాధ, జేవీ మోహన రావు, ఎస్.జయరావు, టి.సాంబ శివరావు, ఎం.కోటేశ్వరరావుల బృందాన్ని అభినందించి సత్కరించారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ లఘు చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని, ఓటు అమ్ముకోవద్దని, విద్యా వంతులు తప్పకుండా ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. మంచి పరిపాలన అభివృద్ధికి తోడ్పడే అభ్యర్థులను గెలిపించుకోవాలనే ఆలోచనలను లఘు చిత్రాలు అందించాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రంగయ్య, పారదర్శక ఎన్నికల పర్యవేక్షణ సమితి కన్వీనర్ పీవీ మల్లికార్జునరావు, ప్రముఖ ఇంజనీర్ కుర్రి రామ సుబ్బారావు, సూర్య ఇన్వెస్టిగేషన్ వ్యవస్థాపకులు కాళహస్తి సత్యనారాయణ, తెలుగు భాషోద్యమ సమాఖ్య కన్వీనర్ డాక్టర్ వి. సింగారావు, ప్రముఖ రంగస్థలం నటుడు నాయుడు గోపి, ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు, ప్రముఖ దర్శకుడు చిట్టినేని శివ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, PRASANNA KOLLIPARA (Old Name), W/o. KOLLIPARA ANIL NAGENDRA KUMAR, Resident of Door No. 82-13-1180, Rama Chandra Puram Colony, Sampath Nagar, Guntur, Guntur District - 522003, Andhra Pradesh. I have changed my name as KOLLIPARA LAKSHMI PRASANNA (New Name) W/o. KOLLIPARA ANIL NAGENDRA KUMAR. Hereafter my name is known as KOLLIPARA LAKSHMI PRASANNA (New Name) W/o. KOLLIPARA ANIL NAGENDRA KUMAR.

శ్రవణ్ కుమార్ ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-తుళ్లూరు: ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం తెనాలి శ్రావణ్ కుమార్ ఉద్దండరాయునిపాలెంలో పర్యటించారు. స్థానికుడైన ఎంపీ నందిగం సురేశ్ 3 రాజధానుల ఉద్యమం చేయించారన్నారు. ప్రజలెవరూ ఆ ఉద్యమానికి వెళ్లలేదని, ఇది తాము సాధించిన నైతిక విజయం అన్నారు.

అమర్తలూరి వెంకటేశ్వరరావు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు పార్లమెంటు అభ్యర్థిగా ఎంసీపీఐ(యు), ప్రముఖ న్యాయవాది అమర్తలూరి వెంకటేశ్వరరావు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా అమర్తలూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సామాన్య ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు తెలిపారు. విద్యా ప్రమాణాలకు ఆజ్య మైన గుంటూరు ప్రజలు తనను అత్యధిక మెజారిటీతో గెలిపిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా జనరల్ సెక్రటరీ మద్దికాయల అశోక్ ఓంకార్, రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం పాల్గొన్నారు.

మే 1న నేటి ఎన్నికల తీరు తెన్నులపై కవితా గోష్టి

విశాలాంధ్ర-గుంటూరు : అరసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని గుంటూరు డిస్ట్రిక్ సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయ ప్రాంగణంలో మే 1వ తేదిన సాయంత్రం 6.15 గంటలకు ఎన్నికల తీరు తెన్నులపై కవితా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా శాఖ తెలిపింది. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో వల్లూరు శివప్రసాద్, కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ సంపాదకత్వం వహించిన ఎన్నికల భారతం(కవితా సంకలనం) ఆవిష్కరణ జరుగనుందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ఈ కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.

సరోజిని విద్యాలయం విద్యార్థుల ఉత్తమ ప్రతిభ

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: నియోజకవర్గ పరిధిలోని పుల్లడిగుంట, ప్రత్తిపాడులో సరోజినీ విద్యాల యంలో విద్యార్థిని విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధిం చారు. పుల్లడిగుంట క్యాంపస్‌లో బోయపాటి లీలా పార్వతి 578 మార్కులు సాధించి మొదటి ర్యాం కులో నిలిచింది. మున్నంగి ధనుష్ 575, మన్నవ లక్ష్మీ చింతన 562 మార్కులు సాధించారు. ప్రత్తి పాడు క్యాంపస్‌లో వందకు వంద శాతం ఉత్తీర్ణ సాధించి ప్రత్తిపాడులో విజయకేతనం ఎగురవేశారు. షేక్ అఫీఫా 578 మార్కులు సాధించగా, గండు అశోక్ 547, కే వెంకట మౌనిక 530 మార్కులు సాధించినట్టు తెలిపారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి విద్యార్థులకు సరోజినీ స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

వైసీపీ రాష్ట్ర బీసీ కార్యదర్శిగా తాడిబోయిన వేణుగోపాల్

విశాలాంధ్ర-పెదకాకాని : వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా తాడిబోయిన వేణుగోపాలరావు నియమితుల య్యారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పెదకాకానికు చెందిన వేణును ఈ మేరకు అధిష్టానం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీని సోమవారం కలసి పుష్పగుచ్ఛాని అందించారు. వేణు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తీవ్రంగా కృషి చేస్తానని తెలిపారు. వైసీపీ నాయకులు సతీష్ రెడ్డి, నర్సిరెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ బి.విజయ లక్ష్మి తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

నేడు జీవి ఆంజనేయులు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర - వినుకొండ : ప్రజా సేవకుడు, పేదల పార్టీ పెన్నిధి మన జీవీ ఆంజనేయులు వినుకొండ అసెంబ్లీ స్థానానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బుధవారం ఉదయం 9గం.లకు నామినేషన్ వేయనున్నారు. నామినేషన్ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్థానిక కారంపూడి రోడ్డులోని సబ్ స్టేషన్ వద్ద నుండి ఆర్టీసీ బస్టాండ్, శివయ్య స్తూపం సెంటర్ మీదగా తహసీల్దార్ కార్యాలయం వద్ద వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. నామినేషన్ మహోత్సవ ర్యాలీకి వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి, నూజెండ్ల, వినుకొండ రూరల్, వినుకొండ టౌన్, ఈపూరు, శావల్యాపురం మండలాల్లోని గ్రామాల నుండి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు అందజేత

విశాలాంధ్ర-వినుకొండ : రానున్న ఎన్ని కల్లో వినుకొండ అసెంబ్లీ స్థానానికి స్వత ంత్ర అభ్యర్థులుగా నలుగురు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఒకరు, జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఒకరు, తమ నామినేషన్లను మంగళవారం నాడు ఎన్నికల అధికారికి అందజేశారు. ఆర్వో సుబ్బారావు నామినేషన్ పత్రాలను పరిశీ లించి స్వీకరించారు. జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా చిరంజీవి నాయక్, స్వతంత్ర అభ్యర్థులుగా ఎస్కే బాజీ, యు.చిన్న కృష్ణ, బి వెంకట ఆ రవికుమార్, నరాల శెట్టి శ్రీనివాసరావు, ఇండియన్ నేష నల్ కాంగ్రెస్ చెన్నా శ్రీనివాసరావు తమ నామినేషన్లను ఎన్నికల అధికారికి అందజేశారు.

ఎమ్మెల్యే గోపిరెడ్డి నామినేషన్‌కు భారీ ఏర్పాట్లు

విశాలాంధ్ర-నరసరావుపేట: పౌరుషాల పురిటి గడ్డ, కళలకు కాణాచి పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మూడోసారి హ్యాట్రిక్ సాధించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం పట్టణంలో భారీ బల ప్రదర్శ నతో వెళ్లి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ ంతో పాటు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుండి కార్యకర్తలను, పార్టీ అభిమానులను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఎంపీ అభ్యర్థి గా పోటీ చేస్తున్న డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్ సైతం కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే డాక్టర్ గోపిరెడ్డి ఆర్డీవో కార్యాలయంలో ఒక సెట్ నామినేషన్లను అందజేశారు.

పది ఫలితాలలో ఉత్తమ ప్రతిభ విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-నకరికల్లు : మండల పరిధిలోని చేజర్ల ఎస్వీఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని షేక్ ఫాహిం ఆధ్వర్యంలో అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపి మొదటి మూడు స్థానాలలో నిలిచిన ఎం.శ్రీవిద్య(564), వి.రంగనాయక్(531), జి.గోపి(522) విద్యార్థులను సన్మానించారు. 600 మార్కులకు గాను 564 మార్కులు సాధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నకరికల్లు మండల స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన ఎం.శ్రీవిద్యను, ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.లలిత, పి.మాలిక, సీహెచ్ వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, గేరా మోహనరావు, ఏసీహెచ్ వెంకట్రావు, బత్తుల సుందర్రావు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థిని బ్రహ్మారెడ్డిని గెలిపించాలని ప్రచారం

విశాలాంధ్ర-దుర్గి: మాచర్ల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని భార్య శోభారెడ్డి, కుమారుడు నాగార్జున రెడ్డి ప్రజలను కోరారు. మండల కేంద్రమైన దుర్గిలో మంగళవారం బ్రహ్మారెడ్డికి మద్దతుగా వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారి వెంట బొజ్జా నరసింహారావు, పగడాల చెన్నా, శెట్టిపల్లి నరసింహారావు, మేకల రామారావు, రామయ్య, జక్కాకొండలు, సింగు నాగేశ్వరరావు, సూరె వెంకటేశ్వర్లు, ఆకుల చిన్న చెన్నయ్య, సూరె కృష్ణ, వెలిదండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రతి ఒక్కరిపై రాక్షసత్వం చూపారు

విశాలాంధ్ర-బెల్లంకొండ: ఐదేళ్ల వైసీపీ పాలనలో రాక్షసత్వం చూపారని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ కోటమీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సోదరి శివరంజని అన్నారు. బెల్లంకొండ మండలంలోని న్యూ చిట్యాల గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఇంటింటికి తిరుగుతూ ఆప్యాయంగా పలకరిస్తూ చిరునవ్వుతో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, పెదకూరపాడు ఎస్టీ సెల్ అధ్యక్షులు నూన్సావత్ హనుమంతరావు నాయక్, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయ్ పాల్గొన్నారు.

నేడు బాలసాని కిరణ్ కుమార్ నామినేషన్

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బలసాని కిరణ్ కుమార్ గుంటూరులో గల ఆయన నివాసం నుండి బయలుదేరి ఊరేగింపుగా ప్రత్తిపాడు తహసి ల్దార్ కార్యాలయము నందు నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు బలసాని కిరణ్ కుమార్ తెలిపారు. ప్రత్తి పాడు నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, నియో జకవర్గ ప్రజలు పాల్గొనాలని కోరారు.

గుంటూరును ఐకాన్ సిటీగా చేద్దాం : గళ్ళా మాధవి

విశాలాంధ్ర-గుంటూరు: రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజలు కూటమిని గెలిపిస్తే గుంటూరు నగరాన్ని ఐకాన్ సిటీగా అభివృద్ధి చేద్దామని గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరులోని 42వ వార్డులోని వికాస్ నగర్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గళ్ళా మాధవి ప్రచారం నిర్వహించారు. గత ఎన్నికల్లో పోలింగ్ తక్కువగా నమోదు అయిందని వచ్చే ఎన్నికల్లో పోలింగ్ 90 శాతం జరగాలంటే ప్రజలు తమ బాధ్యతను మర్చిపోకుండా ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కూటమి అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి నేతలు, కార్యకర్తలు, ప్రజలు భారీగా హాజరై తమ ప్రేమ, అభిమానం, ఆదరణ చూపారన్నారు. ఇదే ఉత్సాహం, స్ఫూర్తి, ఐకమత్యాన్ని కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు వచ్చే రోజుల్లో కూడా కొనసాగించాలని గళ్ళా మాధవి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, గాదె వెంకటేశ్వరావు, బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, వేములపల్లి శ్రీ రామ్ ప్రసాద్,లంకా ఉదయ్ , కనపర్తి శ్రీనివాస్ రావు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. 39 డివిజన్ లో నేతాజీ నగర్, 25 డివిజన్ లలో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్ర శేఖర్‌తో కలిసి గళ్ళా మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింగంశెట్టి వీరయ్య, గాలం వెంకటేశ్వర్లు, రుస్తుం బాబు, వల్లంశెట్టి వీరయ్య, చేజర్ల శివ కుమార్, కదిరి సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి



– సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట నియోజక వర్గంలో మే నెల 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం పార్టీలు బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీ చేయుస్తున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి అలెగ్జాండర్ ని, నర్సరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మహబూబ్ భాషా ని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నరసరావుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశంలో 2014 నుండి నేటి వరకు బీజేపీ అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు కావస్తోందని ఆనాటి నుండి నేటి వరకు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చుటలో బీజేపీ ప్రధాని నరేంద్ర మోడీ పూర్తిగా వైఫల్యం చెందారని తీవ్రంగా విమర్శించారు. రాజ్యాంగాన్ని చేతిలోకి తీసుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రజా హక్కులను కాలరాస్తూ ప్రశ్నించిన వారిపై దుర్మార్గంగా అన్యాయంగా ఈడీ సీబీఐ కేసులు పెట్టి జైళ్లలో కుక్కుతూ అహంకారంతో నియంతృత్వ పోకడలతో అధికార మదంతో మతో న్మాదంతో బీజేపీ శ్రేణులు వారి నాయకత్వం అధికార గణం పెచ్చరిల్లిపోతోందని దళిత మైనారిటీ వర్గాలకు రక్షణ కరువైందని, కార్మికులు రైతులు వారి హక్కులకై దీర్ఘకాలిక పోరాటాలు జరిగా యని ఫలితంగా కేంద్రం కొంత వెనుకకు తగ్గినప్పటికీని మరల విజృంభించటానికి ప్రయత్నం చేస్తున్నదని సీఏఏ, ఎన్ఆర్‌సీని మరలా ప్రవేశపెట్టి మైనార్టీ వర్గాలపై కక్ష తీర్చుకునే ప్రయత్నం మొదలెడు తోందని ఆయన విమర్శించారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న అలెగ్జాండర్ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షేక్ మహబూబ్ బాషాలు మాట్లాడుతూ ఇండియా కూటమి సీపీఐ, సీపీఎం తదితరు లౌకికవాద పార్టీ బల పరిచిన కాంగ్రెస్ అభ్యర్థులుగా పోటీ చేయుచున్న మేము అధికారంలోకి వస్తే మా జాతీయ పార్టీ ప్రకటించినట్లుగా మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి తీరుతామని, రాష్ట్రానికి అమరావతి రాజధాని నిర్మాణం వెంటనే చేపట్టి పూర్తి చేస్తామని ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రం సుభిక్షంగా మారుతుందని అనేక ప్రాజెక్టులు పరిశ్రమలు ఏర్పడతాయని లక్షలాది ఉద్యోగ అవకా శాలు కల్పించబడతాయని, 500 రూపాయలకే గ్యాస్ బండ ఇస్తామని, వృద్ధాప్య పెన్షన్లు రైతులకు ఇన్పుట్ సబ్సిడీ మహిళలకు పెన్షన్లు తక్కువ వడ్డీకి డ్వాక్రా లోనులు తదితర అనేక సౌకర్యాలు కల్పించబడతాయని జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోను దేశంలోని ప్రజలందరికీ వర్తింప చేస్తామని వారన్నారు. ముఖ్యంగా దేశంలోను రాష్ట్రంలోనూ రాజ్యాంగాన్ని ప్రజాస్వా మ్యాన్ని కాపాడుకుంటామని వామ పక్షాలతో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుతామని వారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే ధ్యేయంగా కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ నియంతృత్వ పరిపాలనను అంత మొందిం చడం కోసం సీపీఐ, సీపీఎం కాంగ్రెస్ ఆమ్ ఆద్మీ తదితర దేశవ్యాప్త 29 పార్టీల కూట మిని రాష్ట్రంలో ప్రజలందరూ ఆదరించి గెలిపించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బూదాల శ్రీనివాసరావు ఉలవలపూడి రాము చక్రవరం సత్యనారాయణ రాజు ఉప్పలపాటి రంగయ్య ఏ పవన్ కుమార్ రొద్ద అంజిరెడ్డి యూత్ కాంగ్రెస్ రవి ప్రకాష్ హనీఫ్ కాజా తదితర నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల సహకారంతో విజయం సాధిస్తాం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కమ్యునిస్టు పార్టీల సహకారంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధిస్తారని నరసరావుపేట కాంగ్రెస్ పార్టీ పార్లమెంటు అభ్యర్థి జి అలెగ్జాండర్ తెలిపారు. సోమవారం రాత్రి చిలకలూరిపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం రాధాకృష్ణ పార్టీ నేతలతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాం గాన్ని మార్చాలని, మైనార్టీల హక్కులను కాలరాయాలని చూస్తున్న బీజేపీతో జగన్ అక్రమ సంబంధం కొనసాగిస్తుండగా, టీడీపీ, జనసేనలు సక్రమ సంబంధాలు కొనసాగిస్తున్నాయని ఇందువల్ల ఆ పార్టీలకు ప్రజల నుంచి ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మైనార్టీలకు మనుగడ ఉండదన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటు పడే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 24వ తేదీ బుధవారం కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సీపీఐ, సీపీఎం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా కోరారు. సమావేశంలో సత్తెనపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చుక్కా చంద్రపాల్, గోవిందు శంకర శ్రీనివాస్, ఎం ప్రసన్న, ఎంఏ సలాం, ప్రసన్నాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : మాజీ మంత్రి కన్నా

విశాలాంధ్ర-పెదకూరపాడు: రాష్ట్ర అభివృద్ధి చెందాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని కాసిపాడు, తమ్మవరం, గారపాడు గ్రామాలలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా పెదకూరపాడు నియోజకవర్గ ఎన్డీఏ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అధ్యక్ష వహించగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఐదు సంవత్సరాలు రాక్షస పాలన వైసీపీ ప్రభుత్వం అందించిందన్నారు. సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ను, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను మీ అమూల్యమైన ఓటుముద్దులను సైకిల్ గుర్తుకేసి గెలిపించాలన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ కార్యదర్శి ఎర్రం శెట్టి రామకృష్ణ, మండల తెలుగు పార్టీ అధ్యక్షులు అత్తిమల రమేష్, మల్లెల వెంకట చలపతిరావు, బెల్లంకొండ రామ్ గోపాల్ రావు, వడ్లమూడి వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తాం

విశాలాంధ్ర-రెంటచింతల: అల్లర్లు, గొడవలు లేని హింసారహిత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని పల్నాడు జిల్లా ఎస్పీ గరికపాటి బిందు మాధవ్ అన్నారు. మంగళవారం మండలంలోని రెంటాల, మంచికల్లు, మిట్టగుడిపాడు, పాల్వాయి, జెట్టి పాలెం గ్రామాల్లో ఆయన క్షేత్ర పర్యటన చేసి పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు.రెంటాలలోని మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో రెండు పోలింగ్ బూత్‌లలో ఏర్పాటుచేసిన వెబ్ కాస్టింగ్ సీసీ కెమెరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి ఘటనలకు తావులేకుండా ఎన్నికలు ముగిసేలా చర్యలు తీసుకోవాలని సమస్యలు సృష్టించేవారు, పాత కేసుల్లోని నిందితులపై నిఘా వేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన వెంట గురజాల డీఎస్పీ పల్లపురాజు, సెబ్ డిఎస్పీ జగదీష్, స్థానిక ఎస్సై కేవి నారాయణరెడ్డి ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా బొర్రా వెంకట అప్పారావు నామినేషన్

విశాలాంధ్ర-సత్తెనపల్లి: స్థానిక నినాదంతో మాజీ జనసేన నాయకుడు బొర్రా వెంకట అప్పారావు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ధూళిపాళ్ళ అప్పారావు కార్యాలయం నుంచి తన ప్రచార వాహనంలో ధూళిపాళ్ళ, యన్నాదేవి మీదగా సాగింది. పట్టణం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనాభా బొర్రాను ర్యాలీలో పాల్గొన్నారు. ధూళిపాళ్ళ గ్రామంలో ఎస్సీ కాలిని ఒక్క గజమాలతో స్వాగతం పలికారు.

వ్యవస్థలను మేనేజ్ చేయడంలో మహాదిట్ట రామోజీరావు

– జాతీయ మీడియా అధ్యక్షులు దేవులపల్లి అమర్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వ్యవస్థలను మేనేజ్ చేయడంలో మహాదిట్ట రామోజీరావు అని జాతీయ మీడియా అధ్యక్షులు దేవులపల్లి అమర్ విమర్శించారు. ఆక్సిలరీ సొసైటీ అధ్యక్షులు మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్థానిక బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో 'రోత రాతల రామోజీ మోసాలు' పై మంగళవారం చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దేవులపల్లి అమర్ మాట్లాడుతూ 'ఉదయం' పత్రికను ఎలా చంపారో... అదేవిధంగా మద్యపాన నిషేధంపై పోరాటం పేరుతో మాగుంట కుటుంబాన్ని వేధించి చంద్రబాబుకు ఉపయోగపడే విధంగా మరలా మద్యాన్ని ప్రవేశపెట్టి వెనక నుంచి నడిపిందంతా రామోజీనే అని ఆరోపించారు. ప్రముఖ ఆడిటర్ మందపాటి నాగార్జున రెడ్డి మాట్లాడుతూ రామోజీరావుకు కనీసం రెండు సంవత్సరాల జైలు జీవితం తప్పదన్నారు. వయసును దృష్టిలో పెట్టుకొని రాష్ట్రపతి క్షమాభిక్ష ప్రసాదించవచ్చని వెల్లడించారు. రూ.5,300 కోట్లు పెనాల్టీ ఆర్‌బీఐకి, రూ.1,200 కోట్లు ఇన్‌కం టాక్స్ విభాగానికి చెల్లించాల్సిన స్థితిలో రామోజీ ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మాదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం అసత్య వార్తలతో ప్రజల్ని ప్రభావితం చేయాలని ప్రయత్నిస్తున్న రామోజీ ఆటలు సాగవని అన్నారు. ప్రముఖ హైకోర్టు న్యాయవాది పల్లి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రామోజీ నిత్యం చేసే అసత్య ప్రచారాన్ని సోషల్ మీడియా బలంగా తిప్పికొడుతోందని అన్నారు. ఏసీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పోలే ముత్యం మాట్లాడుతూ పేదల నోటి దగ్గర కూడు తీసి తప్పుడు ప్రచారం చేస్తున్న 'చంద్రబాబు అండ్ కో'లో భాగమైన ఈ రోత రాతల రామోజీని ఎవ్వరు నమ్మరని అన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు సి.డి.భగవాన్, సేవాదళ్ కార్యదర్శి ఉదగిరి మురళీ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రాచకొండ ముత్యాలరాజు, కంది సంజీవరెడ్డి, శివరామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడు సంతోషంగా జీవించే రోజులు తెస్తాం

విశాలాంధ్ర-నరసరావుపేట : రాష్ట్రంలో ప్రస్తుతం పెరిగిన ఖర్చులు, జీవన భారంతో సామాన్యుడు ఇబ్బంది పడుతున్నాడని, ఆ పరిస్థితుల తొలగించి వారు సంతోషంగా జీవించే రోజులు తీసుకొస్తామని ఉమ్మడి కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, చదలవాడ అరవింద్ బాబు అన్నారు. పథకాలు ఇస్తున్నప్పటికీ పెరిగిన ఖర్చులతో సామా న్యుడు నడ్డి విరిగిందని ఈ పరిస్థితికి చెక్ పెడతామన్నారు. నరసరావుపేట రూరల్ మండలంలోని ములకలూరు, కేతుముక్కల అగ్రహారం, పమిడిపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన పార్టీ నరసరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త సయ్యద్ జిలాని ఆధ్వర్యంలో పమిడిపాడు గ్రామంలో భారీ ర్యాలీ, సభ నిర్వహణ జరిగింది. ఈ సభలో వక్తలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు జరిగే పథకాలు తీసుకురాబోతున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంటిని నడిపించే మహిళకు వీలుగా సూపర్ సిక్స్ పథకాల ద్వారా లబ్ది చేయబోతున్నట్లు చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు సంపూర్ణంగా దక్కేలా చూసే బాధ్యత తెలుగుదేశం పార్టీదని అన్నారు. నియోజకవర్గంలో సయ్యద్ జిలానికి సముచిత స్థానం, గౌరవం కల్పిస్తామని, వారి సూచనలు స్వీకరిస్తామని అన్నారు.

అట్టహాసంగా ప్రత్తిపాటి పుల్లారావు నామినేషన్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: భారీగా తరలివచ్చిన అభిమాన గణం, వేలాదిమంది కార్యకర్తల సంబరాల మధ్య చిలకలూరిపేట కూటమి అభ్యర్థిగా మంగళవారం అట్టహాసంగా నామినేష్ దాఖలు చేశారు మాజీమంత్రి, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రత్తిపాటి పుల్లారావు మండు టెండలో భారీ ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చిన ఆయన రిటర్నింగ్ అధికారి బి.నారదమునికి నామపత్రాలు అందజేశారు. ఎన్ఆర్‌టీ సెంటర్, చౌత్రా సెంటర్, కళామందిర్, గడియార స్తంభం సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాల యానికి చేరుకున్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మల్లెల రాజేష్ నాయుడు కూడా పాల్గొన్నారు. అంతకు ముందు సాగిన ర్యాలీ దారి పొడవునా ప్రత్తిపాటి కుమారుడు శరత్ ముందుండి శ్రేణుల్ని ఉత్సాహపరిచారు. వినూత్నంగా తయారు చేసిన గజమాలలతో స్వాగతం పలికారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా ముగ్గురు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల్లో పెదకూరపాడు గ్రామం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పరగటి రాజు, భారత చైతన్య యోజన పార్టీ నుంచి అలా రామకృష్ణారావు, క్రోసూరు మండలం పీసు పాడు గ్రామం నుంచి కంచేటి సాయిబాబాలు ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఆర్వో కందుల శ్రీరాములకు తమ నామినేషన్ పత్రాలను అందించారు.

ప్రధానిపై చర్యలు తీసుకోవాలి : ప్రజా సంఘాలు

విశాలాంధ్ర-నరసరావుపేట: ఇటీవల రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ విద్వేశపూరిత ప్రసంగాలపై ఎన్నికల కమిషనర్ చర్యలు తీసుకోవాలని పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైవి మాట్లాడారు. మోడీ, బీజేపీ నాయకులు అనేకమంది ఇలాంటి ప్రసంగాలనే కొనసాగిస్తున్నారు. అయినప్పటికిని అలాంటి వారిపై చర్యలు లేవు, ఎన్నికల నిబంధనవలి, భారత రాజ్యాంగ ఆదేశిక సూత్రాలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోక పోవడం గమనార్హం. ఓడిపోతాము అనే భయంతో ఎలాగైనా తిరిగి అధికారం చేపట్టడానికి ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు, వీరికి కొన్ని పార్టీలు అంటకాగటం కూడా జరుగుతుంది. ప్రజలు వీరికి వ్యతిరేకంగా ఉద్యమించాలని, వీళ్లను ఓడించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పిడియం జిల్లా కార్యదర్శి జి.రామకృ ష్ణ, నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికెనం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ పాలకవర్గాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేవాలయాల పాలకవర్గాల్లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తామని యువనేత నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఉండవల్లి నివాసంలో నాయీ బ్రాహ్మణులతో యువనేత ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ మున్సిపల్ కాంప్లెక్స్‌లలో నాయీ బ్రాహ్మణులకు కొన్నిషాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటాం. దేవాలయాల్లో క్షురకులుగా నాయిబ్రాహ్మణులను మాత్రమే నియమించే విషయమై గత జీఓలను పరిశీలించి సానుకూల నిర్ణయం తీసుకుంటాం. బీసీలకు నాడు-నేడు పెద్దపీట వేసింది తెలుగుదేశం మాత్రమే. నాయీ బ్రాహ్మణులు అహర్నిశలు కష్టపడుతుంటారు. వారి కష్టాన్ని చూసి మంగళగిరి నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణులకు 122 సెలూన్ షాపులకు కుర్చీలను అందించాం. మంగళగిరిలో సొంత నిధులతో 29 సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. పేదరికం లేని మంగళగిరే నా లక్ష్యం. తెలుగుదేశం పార్టీకి కులం, మతం, ప్రాంతీయ భేదం లేదు. తెలుగువారు ఎక్కడున్నా నెం.1 ఉండాలన్నదే మా ఆశయం. జయహో బీసీ కార్యక్రమం ద్వారా బీసీ డిక్లరేషన్ ప్రకటించాం. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తాం. ఆదరణ పథకాన్ని తిరిగి ప్రవేశపెట్టి ఏడాదికి వెయ్యి కోట్లు ఖర్చుచేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా వృత్తిపనివారికి పనిముట్లు అందజేసి ఆదుకుంటాం. బీసీ కార్పొరేషన్లను బలోపేతం చేసి వారికి ఆర్థికచేయూత అందిస్తామని లోకేష్ తెలిపారు.

మద్దాలి గిరికి సముచిత స్థానం

విశాలాంధ్ర-గుంటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడిగా మద్దాలి గిరిని నియమించడంతో పార్టీలో ఆయనకు సముచిత స్థానం దక్కినట్లు అయిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని తెలిపారు. గుంటూరు నగర అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా మద్దాలి గిరిని మంగళవారం మంత్రి విడదల రజిని శ్యామలానగర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పార్టీ నగర అధ్యక్షుడిగా మద్దాలి గిరి అన్న సేవలు వినియోగించుకుంటామని తెలిపారు. కష్టపడే వారికి ఎప్పుడూ పార్టీలో గుర్తింపు ఉంటుందని చెప్పడానికి గిరి అన్నకు దక్కిన పదవే నిదర్శనమని చెప్పారు. గుంటూరు అభివృద్ధిలో మద్దాలి గిరి అన్నది చెరగని ముద్ర అని పేర్కొన్నారు. సరైన సమయంలో సరైన పదవిని పార్టీ అధిష్టానం ఆయనకు కట్టబెట్టిందని తెలిపారు. గుంటూరు తూర్పు, పశ్చిమ రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసిన వ్యక్తిగా.. ఈ రెండు నియోజకవర్గాల్లో ఆయన గొప్ప కృషి చేయబోతున్నారని తెలిపారు.

పది ఫలితాలలో గీతమ్స్ విద్యా సంస్థలు జయభేరి

విశాలాంధ్ర-వినుకొండ : 2023-2024 సంవత్సర 10వ తరగతి పరీక్ష ఫలితాలలో గీతమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 100% శాతం ఫలితాలు సాధించిందని గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటరెడ్డి తెలియజేశారు. సోమవారం ప్రకటించిన ఎస్.ఎస్. సి ఫలితాలలో 210 పదిమంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 590 మార్కులకు పైగా నలుగురు, 580 మార్కులకు పైగా ఎనిమిది మంది, 570 మార్కులకు పైగా 17 మంది, 550 మార్కులకు పైగా 36, మంది, 500 మార్కులకు పైగా 95 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 100% ఫలితాలను రాబటారని కోటిరెడ్డి తెలియజేశారు. టౌన్ ఫస్ట్ పి. ఇష్రాత్ ఫాతిమా 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించగా, సిహెచ్ వైష్ణవి అపర్ణ 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించగా, వై శ్రీలేఖ 600 మార్కులకు గాను 591 మార్కులు సాధించగా, కె లీల వెంకటసాగర్ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించినట్లు తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించి వరుసగా టౌన్ ఫస్ట్ సాధిస్తున్న ఏకైక విద్యాసంస్థ గీతమ్స్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులువారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీలో భారీ చేరికలు

విశాలాంధ్ర - వినుకొండ : వినుకొండ నియోజకవర్గం లోని నూజండ్ల మండలం చింతలచెరువుగ్రామం తెలుగుదేశం పార్టీకి చెందిన గుమ్మా శబ్బయ్య మంగళవారం వైయస్సార్ కాంగ్రెసు పార్టీలోకి చేరారు. వినుకొండ శాసన సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కూటమి అభ్యర్థి అయిన జీవి ఆంజనేయులకి ఓటమి భయం ఏర్పడింది, అందుకే ప్రతి చోట తాను చేసిన అభివృద్ధిని చెప్పుకోలేక ప్రభుత్వం పై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. వైయ స్సార్ కాంగ్రెసు పార్టీ వారి ఓట్లతో గెలిచి ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్న లావుకు విలువలు లేవని అన్నారు. అలాంటి విలువ లేని వ్యక్తి ఇప్పుడు నీతి వాక్యాలు వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో భారీ చేరికలు

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ మండలం వెంకుపాలెం గ్రామం నుండి 25 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి అభ్యర్థి జీవి ఆంజనేయులు పార్టీ కండువలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో దారివేముల నగేష్, దారి వేములలాలు, దారివేముల అచ్చి బాబు, వేముల బుజ్జి, దారి వేముల వెంకయ్య, దారివేముల మరియబాబు, రాముడు, దారి వేముల భీముడు, చరణ్, పెద్దింటి సుధా, సాతులూరి లక్ష్మయ్య ఉన్నారు.

వినుకొండ : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వినుకొండ పట్టణంలోని 3వ వార్డు నుండి వైసీపీని వీడి టీడీపీలోకి 10 కుటుం బాలు చేరారు. వినుకొండ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జీ.వీ ఆంజనేయులు, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు, వినుకొండ నియోజవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాద్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సాయి బాబా ఆలయంలో చోరీ

– గేటు తాళాల పగులగొట్టి హుండీని తీసుకెళ్ళిన దుండగులు

విశాలాంధ్ర-రొంపిచర్ల: స్థానిక హైవే రోడ్డు పక్కన గల శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో గల శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలోకి వెళ్ళిన భక్తులు గుడి గేటు తాళాలు పగులగొట్టబడి ఉండటాన్ని చూసి ఆలయకమిటీ సభ్యులకు తెలియజేశారు. విషయం తెలుసుకున్న ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు వచ్చారు. గుడి వద్దకు వచ్చిన తరువాత గుడి గేటు తాళాలు పగులగొట్టి, లోపల హుండి మాయం కావటాన్ని గుర్తించారు. గుర్తు తెలియని దుండగులు చోరీకీ పాల్పడి ఉండవచ్చునని అనుమానాలు వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత గుడిలో చోరీ జరిగి ఉండ వచ్చునని అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ సంఘటన గ్రామంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ కె.పి.రవీంద్రబాబు తెలిపారు.

అధ్వానంగా సాగర్-మాచర్ల ప్రధాన రహదారి

విశాలాంధ్ర-విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నుంచి చింతల తండా మీదుగా మాచర్ల వెళ్లే ప్రధాన రహదారి గోతులమయంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాగర్ నుంచి చింతల తండా, చెంచుకాలనీ, బెల్లంకొండ వారి పాలెం, కొప్పునూరు, అలుగు రాజుపల్లి, కొత్తపల్లి గ్రామాల మీదుగా మాచర్ల వెళ్లే ఈ రహదారిలో గుంతలు అడుగు నుంచి రెండు అడుగుల లోతులో ఉన్నాయి. ఈ రహదారిపై వెళ్లే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవు తున్నాయి. గోతులమయంగా మారిన ఈ రహదారిపై ప్రయాణించాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. వాహన చోదకులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

వైసీపీని తరిమికొట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు : మోసపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచేసిన వైసీపీని తరిమికొట్టాలని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ అన్నారు. మంగళవారం అర్బన్ పార్టీ కార్యాలయంలో ప్రభాకర్ విలేకర్లతో మాట్లాడారు. పేదల కష్టార్జితాన్ని జగన్ ప్రభుత్వం జలగలా దోచుకు తింటోందని మండిపడ్డారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను మెనిఫెస్టోలో ప్రకటించారన్నారు. మద్యం ధరలను మూడు రెట్లు పెంచి సామాన్యులను దోచేస్తున్నారని, మద్యంపై వచ్చే అదనపు ఆదాయమంతా జగన్‌కే చేరుతోందని విమర్శించారు. కోతల ప్రభుత్వానికి వాత పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడి గెలవాలని వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలు, రైతులు, యువకులకు సంక్షేమ ఫలాలు అందిస్తామని వెల్లడించారు.

మెడికల్ సీట్లను కూడా అమ్ముకున్న ముఖ్యమంత్రి జగన్

విశాలాంధ్ర-మంగళగిరి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మెడికల్ సీట్లను కూడా వదల్లేదు, కేటగిరిల వారీగా విభజించి పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసి సీట్లు అమ్ముకున్నారని యువనేత నారా లోకేష్ దుయ్యబట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళగిరి కొండపనేని టౌన్ షిప్ వాసులతో యువనేత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ జగన్ తీసుకొచ్చిన మెడికల్ సీట్లు అమ్ముకునే విధానానికి స్వస్తిపలికి, ప్రతిభకలిగిన పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందుబాటులోకి తెస్తాం. జగన్ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేశారు. ఆరోగ్యశ్రీ కింద రూ.1200 కోట్ల బకాయిలు పెట్టడంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కడా ఈ పథకం కింద వైద్యం అందించడం లేదు. రాష్ట్రంలో మరోసారి జగన్‌కు అధికారమిస్తే అంధకారం రాజ్యమేలుతుంది. ఏడాదికి రెండుమూడు సార్లు విద్యుత్ ఛార్జీలతో బాదేస్తారు. కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తామని యువనేత నారా లోకేష్ అన్నారు.